# ఆరోగ్య బీమా క్లెయిమ్ విషయంలో ఈ తప్పులు చేయొద్దు




అత్యవసర సమయంలో అనారోగ్యానికి గురైనపుడు ఆరోగ్య బీమా పాలసీ అండగా నిలుస్తుంది. ఆర్థిక ఇబ్బందుల్లోకి జారుకోకుండా ఆదుకుంటుంది. కొన్నిసార్లు బీమా సంస్థలు పలు కారణాలు చూపుతూ క్లెయింలను తిరస్కరిస్తుంటాయి. ఇలాంటి సందర్భంలో ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి రావొచ్చు. అందుకే ఆరోగ్య బీమా తీసుకున్న ప్రతిఒక్కరూ క్లెయిం తిరస్కరణకు గల కారణాలేమిటో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

క్లెయిం ప్రాసెస్‌లో తప్పులు..ఆరోగ్య బీమా క్లెయిం దాఖలు చేయడంలో ఏదైనా పొరపాటు జరిగితే బీమా సంస్థ తిరస్కరించొచ్చు. అవసరమైన ఫారాల్లో పూర్తి సమాచారం అందించకున్నా, ఆలస్యంగా సమర్పించినా క్లెయిం పొందలేరు. అందుకే క్లెయిం సబ్మిట్ చేయాల్సిన గడువును గుర్తుంచుకోండివ్యాధుల సమాచారం బీమా విషయంలో మీ ఆరోగ్యానికి సంబంధించిన ప్రతి విషయమూ ఎంతో కీలకం. పాలసీ తీసుకునేటప్పుడు దరఖాస్తు పత్రంలో ఇప్పటికే ఉన్న వ్యాధుల గురించి తెలియజేయాలి. ఈ విషయంలో చాలా నిజాయతీగా ఉండాలి. చిన్న పొరపాటు చేసినా, బీమా సంస్థ దాన్నే సాకుగా చూపి క్లెయింను తిరస్కరించే వీలుంటుంది. ఎందుకంటే చాలా సంస్థలు ముందస్తు వ్యాధులకు క్లెయిం కవరేజీని అందించవు. పాలసీ నిబంధనల్లో ఇదే కీలకంగా మారుతుంది. అందుకే పాలసీ కొనుగోలు చేసేటప్పుడు ఈ షరతుల్ని తెలుసుకోండి.కాల వ్యవధి చూసుకోండిప్రతి ఆరోగ్య బీమా పాలసీకి చెల్లుబాటు వ్యవధి ఉంటుంది. సాధారణంగా ఆ గడువు ఏడాది మాత్రమే ఉంటుంది. పాలసీ ద్వారా అందే కవరేజ్‌ని పొందాలంటే కచ్చితంగా గడువు తీరకముందే దాన్ని పునరుద్ధరించుకోవాలి. గడువు ముగిసినట్లయితే పాలసీ పనికిరాదు. అంటే క్లెయిం పొందడానికి అర్హత ఉండదన్నమాట.వెయిటింగ్ పీరియడ్‌బీమా సంస్థలు కొన్ని వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ నిర్ణయిస్తాయి. వెయిటింగ్ పీరియడ్ ముందే చికిత్స కోసం క్లెయిం చేసుకుంటే దాన్ని బీమా సంస్థ ఆమోదించకపోవచ్చు. ఉదాహరణకు మెటర్నిటీ సంబంధిత కవరేజ్ పొందాలంటే సంస్థ నిర్దేశించిన సమయం వరకు ఆగాల్సిందే. బీమా సంస్థలను బట్టి, ఈ వెయిటింగ్ పీరియడ్‌లో వ్యత్యాసం ఉంటుంది. పాలసీ తీసుకునేటప్పుడే ఈ నిబంధన గురించి స్పష్టంగా తెలుసుకోవాలి.వ్యాధుల జాబితా


కొన్ని వ్యాధుల చికిత్సకు పరిహారం లభించదని బీమా సంస్థ ముందుగానే తెలియజేస్తుంది. ఈ జాబితాలో ఉన్న వ్యాధుల చికిత్స కోసం వెళ్లినప్పుడు బీమా సంస్థ పరిహారం ఇవ్వదు. ఈ విషయాన్ని పాలసీ కొనుగోలు సమయంలోనే స్పష్టంగా పేర్కొంటాయి. అందుకే పాలసీ తీసుకునేటప్పుడు ఈ విషయాలు తెలుసుకోవాలి.

# నేను కేవలం ఒక ఉద్యోగినా..అంతకు మించా?



దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యక్తిగత, వృత్తిగత జీవితంపై రాసిన పుస్తకం ఏప్రిల్ 30 నుంచి విక్రయాలకు సిద్ధంగా ఉంటుందని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా(పీఆర్‌హెచ్‌ఐ) ప్రకటించింది. పశ్చిమ గోదావరిలో ఒక చిన్న పట్టణంలో పుట్టి.. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై, ఆ తర్వాత ఆర్‌బీఐ పగ్గాలు చేపట్టిన సుబ్బారావు అత్యద్భుత ప్రయాణాన్ని అక్షరాలుగా మార్చి 'జస్ట్ ఏ మెర్సినరీ?: నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరియర్' పేరుతో పుస్తకంగా తీసుకొస్తున్నారు. 'నేను నా వృత్తి జీవితమంతా అత్యుత్తమంగా పనిచేయడానికే ప్రయత్నించాను. అయితే నన్ను అందుకు ఏది ప్రేరణ ఇచ్చిందన్న విషయం నా మెదడును తొలుస్తూనే ఉండేది. అది కేవలం నా ఉద్యోగ ధర్మమా? జీతమిస్తున్నారు కాబట్టి శక్తివంచన లేకుండా పనిచేశానా? లేదంటే సమాజానికి నేను తిరిగి ఇవ్వాల్సిన అవసరం వచ్చి, ఏదో శక్తి నన్ను నడిపించిందా? క్లుప్తంగా చెప్పాలంటే.. నేను కేవలం జీతం తీసుకుని పనిచేసిన ఉద్యోగినా.. అంతకు మించా? దీనికి సమాధానం నాకెప్పటికీ లభించదేమో' అని దువ్వూరి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోనే..: 2008 నుంచి 2013 వరకు అయిదేళ్ల పాటు సుబ్బారావు ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేశారు. అంతకు ముందు 2007-08లో ఆర్థిక కార్యదర్శిగా, 2005-06లో ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి కార్యదర్శిగా పనిచేశారు. వృత్తి జీవితం తొలినాళ్లలో అంటే 1974లో ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం సబ్ డివిజన్ సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో వేర్వేరు హోదాల్లో 35 ఏళ్ల పాటు పనిచేశారు.74 ఏళ్ల జీవిత ప్రయాణంలో..: 74 ఏళ్ల జీవితంలో తన ఆశనిరాశలు, జయాపజయాలు, తప్పొప్పులు, నేర్చుకున్న పాఠాలు.. ఇలా అన్నిటినీ దువ్వూరి నిజాయతీగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారని పుస్తక ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఈ పుస్తకం యువ వృత్తినిపుణులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని.. తమ ప్రయాణానికి అర్థాన్ని చెబుతుందని పుస్తక వివరణలో ఉంది. ప్రస్తుతం సుబ్బారావు అమెరికాలోని యేల్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు.

# మెదడులో చిప్‌తో వీడియో గేమ్ ఆడిన పక్షవాత బాధితుడు



వాషింగ్టన్: మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలను చేపట్టిన న్యూరాలింక్ నుంచి బుధవారం కీలక అప్‌డేట్ వచ్చింది. చిప్‌ను అమర్చిన వ్యక్తి నోలాండ్ అర్బాగ్‌ను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. పక్షవాతంతో బాధపడుతున్న ఆయనతో వీడియో గేమ్ సివిలైజేషన్ చెస్ ఆడించింది. దాన్ని 'ఎక్స్'లో లైవ్ స్ట్రీమ్ చేసింది. ఎవరి సాయం లేకుండా ఆయన గేమ్ ఆడినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను న్యూరాలింక్ సహ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.లైవ్ స్ట్రీమ్ సమయంలో అర్బాగ్ మాట్లాడారు. తన జీవితంలో ఇక చేయలేననుకున్న చాలా పనులు సొంతంగా చేసుకోగలుగుతున్నానని సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ అధునాతన సాంకేతికతలో ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉందని తెలిపారు. మరింత మెరుగుపరిస్తే చాలా ఉపయోగాలు ఉంటాయని వివరించారు. జీవితంలో తాను గేమ్స్ ఆడతానని ఊహించలేదన్నారు. కానీ, న్యూరాలింక్ (%చీవబతీఖశ్రీఱఅఙ%) చిప్ వల్లే అది సాధ్యమైందని చెప్పారు. తన జీవితంలో ఇప్పటికే చాలా సానుకూల మార్పులు వచ్చినట్లు వెల్లడించారు. గంటలకొద్దీ వీడియో గేమ్స్ ఆడగలుగుతున్నానని తెలిపారు.

ఎనిమిదేళ్ల క్రితం అర్బాగ్ ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెన్నెముక దెబ్బతినటంతో మెడ కింది భాగం మొత్తం చచ్చుబడిపోయింది. కాళ్లు, చేతులు సొంతంగా కదల్చలేని పరిస్థితి. దీంతో తనకిష్టమైన వీడియో గేమ్స్ కూడా ఆడలేకపోయేవాడినని తెలిపారు. కానీ, చిప్ అమర్చిన తర్వాత గంటలకొద్దీ ఆడగలుగుతున్నానని చెప్పారు. ఎవరి సాయం లేకుండా కేవలం మెదడుతోనే ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వగలుగుతున్నానని వెల్లడించారు. చిప్‌ను తరచూ ఛార్జ్ చేయాల్సి రావడం ప్రస్తుతానికి ఉన్న ఒక పెద్ద పరిమితి అని తెలిపారు. వైర్‌లెస్ విధానంలో ఛార్జింగ్ చేస్తారు.మానవ మెదడులో విజయవంతంగా చిప్‌ను అమర్చినట్లు జనవరి చివర్లో న్యూరాలింక్ ప్రకటించింది. కంప్యూటర్‌తో మానవ మెదడు నేరుగా సమన్వయం చేసుకొనే 'బ్రెయిన్- కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' (%దీజ×%) ప్రయోగాలకు అమెరికా 'ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (%ఖీణూ%)' గత ఏడాది మేలో ఆమోదం తెలిపింది. న్యూరాలింక్ చిప్‌ను ఇప్పటికే పందులు, కోతుల్లో విజయవంతంగా పరీక్షించారు. ఈ సాధనం అత్యంత సురక్షితమైనదని, విశ్వసనీయమైందని వెల్లడైనట్లు ఆ సంస్థ నిపుణులు చెప్పారు. దీని సాయంతో ఒక కోతి 'పాంగ్' వీడియో గేమ్‌ను ఆడింది.ఎలా పనిచేస్తుందంటే..న్యూరాలింక్ బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ లో 8 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన ఎన్1 అనే చిప్ ఉంటుంది. దానికి సన్నటి ఎలక్ట్రోడ్లు ఉంటాయి. వెంట్రుకతో పోలిస్తే వాటి మందం 20వ వంతు మాత్రమే. పుర్రెలో చిన్న భాగాన్ని తొలగించి అక్కడ ఎన్1 సాధనాన్ని అమరుస్తారు. ఈ చిప్‌నకు ఉండే సన్నటి ఎలక్ట్రోడ్లను మెదడులోకి చొప్పిస్తారు. ఒక చిప్‌లో మూడువేలకుపైగా ఎలక్ట్రోడ్లు ఉంటాయి. వాటిని మెదడులోని ముఖ్యమైన భాగాలకు చేరువగా ప్రవేశపెడతారు. అవి సుతిమెత్తగా ఎటుపడితే అటు వంగేలా ఉంటాయి. ఎలక్ట్రోడ్లు.. మెదడులోని న్యూరాన్ల మధ్య ప్రసారమవుతున్న సందేశాలను గుర్తించి చిప్‌నకు పంపుతాయి. ఒక చిప్‌లోని ఎలక్ట్రోడ్లు వెయ్యి న్యూరాన్ల చర్యలను పరిశీలిస్తాయి. మొత్తం మీద ఒక వ్యక్తిలోకి 10 చిప్‌లను ప్రవేశపెట్టొచ్చు. ఇన్‌స్టాల్ అయ్యాక ఈ బీసీఐ.. మెదడు నుంచి విద్యుత్ సంకేతాలను పంపడం, అందుకోవడం, ప్రేరేపించడం వంటివి చేస్తుంది. వాటిని కంప్యూటర్లు విశ్లేషించగలిగే అల్గారిథమ్‌లుగా మారుస్తుంది.

# 40% సంపద.. 1% మంది వద్దే

దిల్లీ: మన దేశ సంపదలో 40.1%, ఆదాయంలో 22.6 శాతం, అగ్రశ్రేణి 1 శాతం మంది కుబేరుల వద్దే ఉన్నట్లు వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక తెలిపింది. 2022-23కు సంబంధించిన ఈ గణాంకాల ప్రకారం..అతి తక్కువ మంది వద్ద ఇంత సంపద పోగుపడటం దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికా కంటే భారత్‌లోనే ఎక్కువని పేర్కొంది. చరిత్రాత్మకంగా చూసినా.. ఇంత భారీగా సంపద అతి కొద్దిమంది వద్ద ఉండటమూ ఇప్పుడేనని తెలిపింది. 2000 సంవత్సరం నుంచి ఆదాయ అసమానతలు భారత్‌లో పెరుగుతున్నా, 2014-15 నుంచి 2022-23 మధ్య ఇది మరింత అధికమైనట్లు నివేదిక వెల్లడించింది. న్యూయార్క్, హార్వర్డ్, పారిస్ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖ ఆర్థిక వేత్తలు నితిన్ కుమార్ భారతి, లుకాస్ ఛాన్సెల్ థామస్ పికెట్టీ, అన్‌మోల్ సోమాంచి 'ఇన్‌కమ్ అండ్ వెల్త్ ఇన్‌ఈక్వాలిటీ ఇన్ ఇండియా, 1922-2023: ది రైజ్ ఆఫ్ ద బిలియనీర్ రాజ్' పేరుతో ఈ పత్రం రాశారు. బ్రిటిష్ రాజ్‌తో పోల్చినా ప్రస్తుతం దేశంలో ఆదాయం, సంపద అసమానతలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత 1980 వరకు ఆదాయం, సంపదలో ప్రజల మధ్య అసమానతలు తగ్గుతూ వచ్చినట్లు వివరించారు. 2000 సంవత్సరం నుంచి సంపద కేంద్రీకరణ అధికమవుతోందని నివేదిక తెలిపింది. 1922లో టాప్ 1% ప్రజల ఆదాయం 13 శాతంగా ఉండగా, అంతర్యుద్ధ సమయంలో అది



20 శాతానికి పైగా పెరిగింది. 1982కు 6.1 శాతానికి దిగొచ్చింది. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత ఆదాయ కేంద్రీకరణ అధికమవుతూ, 2022లో 22.6 శాతానికి చేరింది.ఆదాయం, సంపదపై పన్ను స్మృతిని సరిదిద్ది, సామాన్యులకు ఆరోగ్యం-విద్య-బలవర్ధక ఆహారం అందించేందుకు ప్రభుత్వాలు వెచ్చించాలని సూచించింది. 2022-23లో 167 అత్యంత కుబేర కుటుంబాల సంపదపై 2 సూపర్‌ట్యాక్స్ విధించడం ద్వారా, జాతీయ ఆదాయంలో 0.5 శాతం లభించేదని, ఈ మొత్తాన్ని ఆయా సంక్షేమ పథకాలకు వినియోగించొచ్చని పేర్కొంది.

# మహిళా నియామకాల్లో హైదరాబాద్, పుణె టాప్



ముంబయి: దేశ జనాభాలో 69.2 కోట్ల మంది మహిళలు కాగా.. అందులో 37% మంది ఉద్యోగం లేదా ఉపాధి కలిగి ఉన్నారని కెరియర్‌నెట్ అనే టాలెంట్ సొల్యూషన్ల సంస్థ తన నివేదికలో పేర్కొంది. హైదరాబాద్, పుణె, చెన్నై వంటి నగరాలు మహిళా ఉపాధి విషయంలో అగ్రస్థానంలో ఉన్నాయని తెలిపింది. 25,000 ఉద్యోగ నియామకాలను విశ్లేషించిన అనంతరం రూపొందించిన 'ద స్టేట్ ఆఫ్ ఉమెన్స్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా' పేరిట తీసుకొచ్చిన ఈ నివేదికలోని ముఖ్యాంశాలు..

2022తో పోలిస్తే 2023లో ఉద్యోగ నియామకాల్లో మహిళల ప్రాధాన్యం 2-3% పెరిగింది. ముఖ్యంగా జూనియర్ ప్రొఫెషనల్, ఎగ్జిక్యూటివ్ బోర్డుల్లో ఈ మార్పు కనిపించింది. గతేడాదిలో ఉద్యోగాల్లో చేరిన 40% మంది వనితలు తాజాగా కళాశాలల నుంచి వచ్చినవారే. నీ 0-3 ఏళ్లు, 3-7 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగాల్లో మహిళల వాటా 20-25% ఉంది.దిల్లీ, ఎన్‌సీఆర్ మినహా దాదాపు అన్ని నగరాల్లో మహిళా నియామకాల నిష్పత్తి పెరిగింది. హైదరాబాద్‌లో అత్యధికంగా 34% నియామక రేటు నమోదు కాగా.. పుణెలో 33%, చెన్నైలో 29% ఉంది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో 20% క్షీణత కనిపించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగంలో మహిళల నియామకాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్(జీసీసీలు), బహుళజాతి కంపెనీ(ఎమ్‌ఎన్‌సీ)ల ఆఫ్‌షోర్ యూనిట్లలో ఆ ధోరణి కనిపిస్తోంది. పురుషులు, మహిళల మధ్య వేతన అంతరం 2022లో 30 శాతంగా ఉండగా.. గతేడాది 20 శాతానికి తగ్గింది. సమాన వేతన విధానాల దిశగా అడుగులు పడుతున్న సంకేతాలివి గత రెండేళ్లుగా మధ్య స్థాయి యాజమాన్య హోదాల్లో మహిళల నియామకంలో ఎటువంటి మార్పూ(23%) లేదు.తిరిగి ఉద్యోగాల్లో చేరే సమయంలో మహిళలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారత అంకురాల్లో మహిళల ప్రాధాన్యం పెరుగుతోంది.

# షాపింగ్ చేసేటప్పుడు ఈ చిట్కాలను పాటించండి

పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. ఈ వేడుకలకు కొనుగోళ్లు ఎక్కువే ఉంటాయి. వివాహాలు జరిపే కుటుంబాలే కాకుండా హాజరయ్యేవారూ షాపింగ్ చేయడం పరిపాటి. సీజన్ సమీపిస్తున్న కొద్దీ ఆకర్షణీయమైన తగ్గింపులు ఉంటాయి. చాలా మంది అత్యుత్తమ డీల్స్‌ను పొందేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఖర్చులను తెలివిగా ప్లాన్ చేయడం అవసరం. దాని కోసమే ఇవిగో కొన్ని చిట్కాలు..బడ్జెట్..షాపింగ్ చేసే ముందు బడ్జెట్ సెట్ చేసుకోండి. పెళ్లి షాపింగ్ ఒక్కటే ఖర్చు కాదు.. అనేక వ్యయాల మిళితం. ప్రతి ఖర్చులోను తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. షాపింగ్ ప్రారంభించే ముందు ఎంత ఖర్చు చేయగలరో నిర్ణయించుకోండి. వివిధ వ్యాపార సంస్థలు ఆఫర్లు ఇస్తుంటాయి. అలాగని బడ్జెట్ గురించి ఆలోచించకుండా ఖర్చు పెడితే ఇబ్బంది పడతారు. బడ్జెట్‌లో వచ్చే వస్తువులను కొనుగోలు చేయాలి. తగిన బడ్జెట్‌ను ముందే సెట్ చేసుకోవడం వల్ల అధిక వ్యయం చేయకుండా ఉంటారు. అవసరమైన కొనుగోళ్లకే ప్రాధాన్యతనిస్తారు.షాపింగ్ జాబితా..

కావలసిన వస్తువుల జాబితాను ఇంటి దగ్గరే రాసుకోండి. కొనుగోలు సమయంలో ఆ జాబితాకే కట్టుబడి ఉండండి. అనవసరమైన వస్తువులను కొనుగోలు చేయకుండా ఇది నిరోధిస్తుంది. అంతేకాకుండా, వివాహానికి సరిపడా అన్ని వస్తువులు ఒకేచోట లభించకపోవచ్చు. చాలా చోట్ల షాపింగ్ చేయవలసి ఉంటుంది. షాపింగ్ చేసే ప్రతిచోటా అనవసర కొనుగోళ్లు చేయకుండా జాబితా ఉపయోగపడుతుంది. చాలామంది రిటైలర్లు వ్యూహాత్మకంగా క్యాష్ / చెక్‌అవుట్ కౌంటర్ల వద్ద ఆకర్షణీయ వస్తువులను ప్రదర్శనలో ఉంచుతారు. వాటిపై దృష్టి కేంద్రీకరించకపోవడమే మంచిది. లిస్ట్‌లో రాసుకున్నవాటినే కొనుగోలు చేయడం వల్ల మీకు సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది.ధరల పోలిక..వస్తువులను చూసిన మొదటి షాప్‌లోనే కొనుగోలు చేయనక్కర్లలేదు. నాణ్యతగల వస్తువును, సరైన ధరకు పొందుతున్నారని నిర్ధరించుకోవడానికి వివిధ రిటైలర్లు, ఆన్‌లైన్ స్టోర్స్ ధరలతో సరిపోల్చండి. కొన్ని పేరున్న దుకాణాల్లో, ఆన్‌లైన్ రిటైలర్స్ వద్ద కొన్ని రోజులలో ప్రత్యేక ఆఫర్లు ఉంటాయి. ఎక్కువ కొనుగోలు చేసినప్పుడు డిస్కౌంట్స్ మరింతగా ఉండొచ్చు. కాబట్టి, ధరల విషయంలో ప్రతి విక్రయశాలను పరిగణనలోకి తీసుకోవడం మంచిది. మీ కొనుగోళ్లపై అదనపు తగ్గింపులను అందించే కూపన్స్, ప్రోమో కోడ్స్ లేదా క్యాష్ బ్యాక్ ఆఫర్ల కోసం చూడండి. కొనుగోళ్లు చేయాలనుకున్నప్పుడు వివిధ రిటైలర్ల నుంచి విక్రయ ప్రకటనలు, అప్‌డేట్‌లపై ఓ కన్నేయండి. ఎర్లీ షాపింగ్..

ఉదయం వేళలలో షాపింగ్ చేయడం కొనుగోలుదారులకు అనుకూలంగా ఉంటుంది. రద్దీ ఎక్కువ ఉండదు కాబట్టి, దుకాణదారులు ఎక్కువ ఐటెమ్స్‌ను విసుగు లేకుండా చూపిస్తారు. బేరమాడడానికి అవకాశముంటుంది. కొన్ని దుకాణాలలో ఎక్కువ జనాదరణ పొందిన వస్తువులు త్వరగా అయిపోతాయి. ఉదయం వెళ్లడం వల్ల వాటిని చేజిక్కుంచుకోవడానికి అవకాశం ఉంటుంది. షాపులు మూసివేసే సమయంలో హడావుడిగా కొనుగోలు చేయడం అంతగా లాభించదు. ఇలాంటి సమయాల్లో బేరమాడడానికి పెద్దగా అవకాశం ఉండదు.బల్క్ కొనుగోళ్లు..వివాహ వేడుకలలో ఒకే రకమైన వస్తువును ఎక్కువ మొత్తం (బల్క్‌గా)లో కొనుగోలు చేసే అవసరం ఉంటుంది. సాధారణంగా కొంత కాలం నిల్వ ఉండే వస్తువులు, అతిథులకు ఇచ్చే బహుమతులు వంటి కొన్ని వస్తువులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుంటారు. ఇలా ఎక్కువ వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు భారీగా డిస్కౌంట్స్ లభించే అవకాశం ఉంది. ఇలాంటి కొనుగోళ్లకు రిటైల్ మార్కెట్లను ఆశ్రయించకుండా.. టోకు సరకుల దుకాణాల్లో కొనుగోలు చేయడం మంచిది. ధరలు పెద్ద మొత్తంలో తగ్గే అవకాశం ఉంది.నగదు..చాలా మంది షాపింగ్ సమయంలో డెబిట్ / క్రెడిట్ కార్డులను, యూపీఐను ఉపయోగిస్తున్నారు. మీ ఆర్థిక సామర్థ్యం ఆధారంగా కొనుగోలు చేయగలిగిన వాటిని మాత్రమే డెబిట్ కార్డులను ఉపయోగించి కొనుగోలు చేయండి. జేబు / ఖాతాలో ఉన్న నగదును ఇచ్చేటప్పుడు ఖర్చు గురించి ఎక్కువగా ఆలోచిస్తాం! దీనివల్ల కొంతవరకు ఆదా చేసుకోవచ్చు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252,
Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy